# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం-24- మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 363 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## ప్రభుత్వం రైతు మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంది..

### తెలంగాణకు ఆదర్శవంతమైన రూపం ఇవ్వడమే లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- హైదరాబాద్‌ను అద్భుత నగరంగా మారుస్తాం
- జహీరాబాద్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నిమ్జ్ భూముల నిర్వాసితులకు ఇళ్ల మంజూరు
- నిమ్జ్ పనులకు వేగం – హ్యూందయ్ రాక శుభవార్త
- చెక్కర కర్మాగారానికి స్థలం, నిధుల మంజూరు
- నిధుల మంజూరుతో మెదక్ అభివృద్ధి లక్ష్యం
- అభివృద్ధికి ప్రధాని మోదీతో పలుమార్లు భేటీ సిద్ధం
- అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రధానమంత్రి మోదీతో ఎన్నిసార్లు అయినా భేటీకి సిద్ధంగా ఉన్నారు.
- ఇందిరాగాంధీ ఆదర్శంగా ప్రజాసంక్షేమ పాలన

సంగారెడ్డి జిల్లా బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:

సామాజిక న్యాయం సమాన అవకాశాలతో తెలంగాణను ప్రపంచంలోనే ఒక గొప్ప ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించేది లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోనని, అందుకు అండగా నిలబడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి గారు ప్రసంగించారు.

జహీరాబాద్ నిమ్జ్ కోసం భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారికి ఆదేశాలిచ్చారు.

మిగతా 2లో..

## విశ్వగురు శ్రీ బసవేశ్వరుడి స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం

2లో..

## ఎన్నిసార్లైనా ప్రధానిని కలుస్తా.. నిధులు తెస్తా

2లో..

## కేసీఆర్ చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయి

### ఎమ్మెల్సీ కవిత



- అమెరికా పర్యటన తర్వాత ఘన స్వాగతం
- కేసీఆర్‌కు రాసిన లేఖపై వివరణ
- లేఖ లీక్ వెనుక కుట్రలు?
- "నా లేఖే లీక్ అయితే... మిగిలినవారిది ఏంటి?"
- 'కోవర్టులను పక్కకు తొలగించాలి'
- లేఖ వెనుక వ్యక్తిగత ఎజెండా లేదు
- లేఖ చూసి ఇతర పార్టీల సంబరాలకు తావులేదు
- ఎల్కతుర్తి సభ తర్వాత లేఖపై చర్చ

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

'మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది' అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ఆమెకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో జాగృతి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

"వరంగల్ సభ తర్వాత రెండు వారాల క్రితం నా తండ్రి, భారాస అధినేత కేసీఆర్‌కు లేఖ రాశా. నా అభిప్రాయాలు లేఖ ద్వారా స్పష్టం చేశా.

మిగతా 2లో..

## అందరికీ నాణ్యమైన విద్య

- నాణ్యమైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఎడ్యుకేషన్ ఎక్స్‌పో - 2025 కు శుభారంభం
- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- బీఆర్ఎస్ పాలనలో విద్యా రంగం నిర్లక్ష్యం
- విద్యా వ్యవస్థ పునరుద్ధరణలో కాంగ్రెస్ పార్టీ పాత్ర
- ప్రైవేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ బడులు
- తెలంగాణ యువత ప్రతిభ – పెట్టుబడులకు దారి
- నైపుణ్యాల్లో లోటు – ప్రైవేట్ సంస్థల పాత్ర
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీతో భాగస్వామ్యం పిలుపు
- గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎక్స్‌పో ఏర్పాటు పిలుపు

### "ఎడ్యుకేషన్ ఎక్స్ పో - 2025" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

అందరికీ నాణ్యమైన విద్యను అందించడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగానే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీలో టీవీ 9, క్యాబ్ కన్సల్టెంట్స్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఎడ్యుకేషన్ ఎక్స్ పో 2025"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

మిగతా 2లో..






## యూటీ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి

- వరదల వల్ల పాడైన యూటీ పనులు వేగవంతం
- అధికారులకు మంత్రి గట్టి ఆదేశాలు
- 24 గంటల రెండు షిఫ్టుల్లో పని చేపట్టాలని సూచన
- 15-20 రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

3లో..

## బాధితురాలే నిందితుడికి మద్దతుగా నిలిచిన అరుదైన తీర్పు




- అరుదైన కేసుకు సుప్రీం కోర్టు మానవీయ దృష్టికోణం
- భావోద్వేగ అనుబంధం, ప్రస్తుత కుటుంబ జీవితం కీలకాంశాలు
- పాక్‌సో చట్టం కింద 20 ఏళ్ల శిక్షను రద్దు చేసిన తీర్పు
- హైకోర్టు వివాదాస్పద వ్యాఖ్యలపై సుప్రీం మండిపాటు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

పోక్సో చట్టం కింద శిక్ష పడ్డ ఓ వ్యక్తికి దేశ సర్వోన్నత న్యాయస్థానం ఊరట ఇచ్చింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగిస్తూ అతని శిక్షను రద్దు చేసింది. ఇదొక అరుదైన కేసుగా పేర్కొన్న సుప్రీం కోర్టు అద్భుతమైన తీర్పు ఇస్తూనే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "కుటుంబం ఆమెను వదిలేసింది. వ్యవస్థ ఆమెను నిందించింది.

మిగతా 2లో..

## ట్రంప్ ఐఫోన్లపై టారిఫ్ బాంబు



- భారత్‌లో ఉత్పత్తికి నో అంటున్న ట్రంప్
- ఐఫోన్లపై 25 శాతం దిగుమతి సుంకం విధించే సూచన
- టారిఫ్ కారణంగా ధరలు పెరిగే అవకాశం
- ఉత్పత్తి వ్యయ భారం వినియోగదారులపై పడే సూచనలు
- అమెజాన్, వాల్‌మార్ట్‌లకు అయోమయం

వాషింగ్టన్: (తెలంగాణ ముచ్చట్లు)

ఐఫోన్లను అమెరికాలోనే తయారు చేయాలంటూ యాపిల్ కంపెనీపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింతగా ఒత్తిడి పెంచారు. భారత్‌తో సహా మరెక్కడ ఉత్పత్తి చేసినా 25 శాతం దిగుమతి సుంకం తప్పదంటూ తాజాగా అల్టిమేటం జారీ చేశారు. "అమెరికాలో విక్రయించే ఐఫోన్లను ఇక్కడే తయారు చేయాలని యాపిల్ చీఫ్ టిమ్ కుక్‌కు ఎప్పుడో చెప్పా. భారత్‌లోనో, మరో దేశంలోనే తయారు చేస్తామంటే కుదరదని స్పష్టం చేశా. కానీ ఆయన వినడం లేదు. అందుకే యాపిల్ ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ విధించాలని నిర్ణయించా" అని శుక్రవారం తన సొంత 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ వెల్లడించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వం రైతు మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంది..

(మొదటి పేజీ తరువాయి)



గత పదేళ్ల కాలంలో జహీరాబాద్ నిమ్జ్ పూర్తిగా కుంటుపడిందని చెబుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచి భూ సేకరణను వేగవంతం చేశామన్నారు. హ్యూందయ్ సంస్థ త్వరలోనే ఇక్కడ కార్య కలాపాలను ప్రారంభించనుందన్న శుభవార్తను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

రైతులంతా కలిసి సహకార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నడిపిస్తామంటే చెక్కర కర్మాగారం ఏర్పాటుకు నిమ్జ్‌లో వంద ఎకరాలు కేటాయించి అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు. ఆ తర్వాత అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని పనిచేస్తామని, అభివృద్ధి, రాష్ట్రానికి రావలసిన నిధుల విషయంలో ఎన్నిసార్లయినా ప్రధానమంత్రి మోదీ గారిని కలుస్తానని పునరుద్ఘాటించారు. మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ చేసిన అనేకానేక అభివృద్ధి కార్యక్రమాలు, ఈ జిల్లాతో ఉన్న విడదీయలేని అనుబంధాన్ని వివరించారు. ఇందిరాగాంధీ గారి స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తోందని చెప్పారు. ప్రభుత్వం రైతు, మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని.. రుణ విముక్తులను చేయడానికి రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సహాయం కింద రైతు భరోసాను 10 నుంచి 12 వేలకు పెంపు, మద్దతు ధరతో పాటు ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లింపు, భూమిలేని వ్యవసాయ నిరుపేదలకు 12 వేల చొప్పున సహాయం అందిస్తున్న విషయాలను ముఖ్యమంత్రి గారు వివరించారు. మహిళల కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరంగా తెలియజేశారు. వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవడానికి నిర్ధేశించుకున్న కార్యక్రమాలను విశదీకరించారు.

జహీరాబాద్ పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొనడానికి ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన పెట్రోల్ పంపును ప్రారంభించారు. అక్కడే మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వారి ఉత్పత్తులను పరిశీలించారు. సభా వేదికగా సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్యకు బ్యాంకు లింకేజీ కింద రూ. 126.54 కోట్లు, మెప్మా కింద 17.51 కోట్లకు సంబంధించి చెక్కును అందజేశారు. జిల్లాలో రూ. 494.67 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు లోక్‌సభ సభ్యులు సురేష్ షెట్కర్ , సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , మహమ్మద్ అలీ, షబ్బీర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, నారాయణ ఖేడ్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నిసార్లైనా ప్రధానిని కలుస్తా.. నిధులు తెస్తా

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.**

సంగారెడ్డి బ్యూరో, జహీరాబాద్.
తెలంగాణ ముచ్చట్లు.

ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పని చేస్తామని తెలిపారు. ఎన్నిసార్లైనా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం జహీరాబాద్ హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆపై కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జహీరాబాద్ పారిశ్రామికవాడ భూసేకరణలో అన్యాయం జరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పెంచామని.. జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని... నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. మెదక్ జిల్లా పేరు చెబితేనే ఇందిరమ్మ గుర్తొస్తుంది అని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ జిల్లా ప్రజలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటుందన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేశామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష చేస్తామన్నారు. భవిష్యత్‌లోనూ మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

సింగూరు ప్రాజెక్ట్‌ను ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతామన్నారు. సింగూరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులను అప్పుల బాధ నుంచి తప్పించామని.. రైతు భరోసా పథకం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అన్నారని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కంకణం కట్టుకున్నామని స్పష్టం చేశారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడితే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. 'మీరు అండగా ఉండండి... ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది' అని వెల్లడించారు. గత ప్రభుత్వ నేత అలిగి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారంటూ విమర్శించారు. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రతిపక్ష నేతల అసెంబ్లీకి రావాలని... సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# విశ్వగురు శ్రీ బసవేశ్వరుడి స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

సంగారెడ్డి బ్యూరో, జహీరాబాద్

హుగ్గెల్లిలో ఏర్పాటు చేసిన బసవేశ్వరుని విగ్రహన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించారు. బేగంపేట ఎయిర్పోర్ట్ నుండి హెలికాప్టర్ లో జహీరాబాద్ కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి కి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐజీ సత్యనారాయణ, ఎంపీ సురేష్ షెట్కర్,కాంగ్రెస్ నాయకులు నీలం మధు. తదితరులు హెలిపాడ్ వద్ద స్వాగతం పలికారు. హుగ్గెల్లిలో బసవేశ్వరుడి విగ్రహం వద్ద వేద పండితులు, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్ లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

విశ్వగురు శ్రీ బసవేశ్వరుడి స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు చెప్పారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గెల్లిలో ఏర్పాటు చేసిన శ్రీ బసవేశ్వర మహారాజ్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

అనంతరం మాట్లాడుతూ, బసవన్న గారి స్ఫూర్తితోనే రాష్ట్రంలో కుల గణన చేపట్టామని అన్నారు. బసవేశ్వరుడు సామాజిక న్యాయం అందించేందుకు ఎంతో కృషి చేశారని విశ్వగురు విధానాలను ముఖ్యమంత్రి గారు స్మరించుకున్నారు. బసవన్న గారి స్ఫూర్తి సందేశానికి అనుగుణంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, వారి సందేశమే పరిపాలనకు సూచిక అని అన్నారు. పేదలకు న్యాయం జరగాలని ఆనాడు అనుభవ మంటపాల ద్వారా తెలుసుకున్న విశ్వగురు ఆదర్శంగానే ప్రస్తుతం పార్లమెంట్, శాసనసభలు నిర్వహించుకుంటున్నామని వివరించారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, జహీరాబాద్ ఎమెల్యే మాణిక్ రావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , ఎంపీ సురేష్ షెట్కర్, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జిల్లా ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

అంతర్గతంగా రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందో అర్థం కావడం లేదు. దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు. నా కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుక పూర్తి చేసుకొని అమెరికా నుంచి వచ్చే లోపు లేఖ బహిర్గతం అయింది. దానిపై హంగామా నడుస్తున్నట్టు తెలిసింది. కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయని మొన్ననే చెప్పాను. నేను అంతర్గతంగా కేసీఆర్‌కు రాసిన ఉత్తరం బహిర్గతం కావడంపై పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన విషయం. పార్టీలో నాయకులు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో ప్రస్తావించాను. గతంలోనూ నా తండ్రికి అంతర్గతంగా లేఖలు రాశా. కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖ లీక్ అయింది. దీన్నిబట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నా పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన వారి పరిస్థితేంటి? నా లేఖ లీక్ వెనుక ఎవరో ఉండి ఉండొచ్చు. కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. వాటి వల్లే పార్టీకి నష్టం. మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది. కేసీఆర్ నాయకత్వంలోనే భారాస పార్టీ ముందుకెళ్తుంది.కోవర్టులను పక్కకు తప్పిస్తే పార్టీ బాగుపడుతుంది. పార్టీలో చిన్న చిన్న లోపాలను చర్చించుకోవాల్సిన అవసరముంది. నా తండ్రికి నేను రెగ్యులర్‌గా లేఖలు రాస్తా. ఇందులో వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. నా లేఖ చూసి కాంగ్రెస్, భాజపా సంబర పడ్డాలిన పనిలేదు'' అని కవిత అన్నారు. ఎల్కతుర్తి సభ తర్వాత పాజిటివ్, నెగిటివ్ ఫీడ్ బ్యాక్ పేరుతో భారాస అధినేత కేసీఆర్‌కు ఇటీవల కవిత రాసిన లేఖ బయటికొచ్చింది. ఈ లేఖ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం కావడంతో ఆమె స్పందించారు.





# అందరికీ నాణ్యమైన విద్య

(మొదటి పేజీ తరువాయి)

విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, దాన్ని తిరిగి గాడిలో పెట్టి అందరికి నాణ్యమైన విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి అప్పుడూ... ఇప్పుడూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే కృషి చేసిందన్నారు.

మన విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు 1991 1992 లోనే అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఓ వైపు సర్కార్ బడులను బలోపేతం చేస్తూనే... మరోవైపు ప్రైవేట్ విద్యా సంస్థల ఏర్పాటును ప్రోత్సహించిందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు ధీటుగా సర్కార్ బడులను తీర్చి దిద్దేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. తెలంగాణ యువత ప్రతిభే మనకు పెద్ద ఆస్తి అని, అందుకే ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలు మన దగ్గర పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఏటా 2.5 లక్షల మంది గ్రాడ్యుయేట్ పట్టా తీసుకుంటున్నారని, కానీ... వారిలో చాలా మందికి పరిశ్రమలకు అవసరమైన కనీస నైపుణ్యాలు ఉండటం లేదన్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు ప్రైవేట్ విద్యా సంస్థలు కృషి చేయాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చిదిద్దాలని, అందుకోసం ''యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ''తో భాగస్వామ్యం కావాలని వారిని కోరారు. ఉన్నత విద్యపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీవీ 9 యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఇలాంటి సదస్సులను గ్రామీణ ప్రాంతాల్లోనూ నిర్వహించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలాకృష్ణా రెడ్డి, పలు ప్రైవేట్ విద్యా సంస్థలు, టీవీ 9, క్యాబ్ కన్సల్టెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధితురాలే నిందితుడికి మద్దతుగా నిలిచిన అరుదైన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయ వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. చట్టం దృష్టిలో ఇది నేరమే అయి ఉండొచ్చు. కానీ, బాధితురాలే జరిగిన దానిని నేరంగా పరిగణించడం లేదు. ఇప్పుడు ఆమె వేదనల్లా..నిందితుడికి శిక్ష పడకుండా రక్షించుకోవాలని. అందుకోసమే ఆమె పోలీస్, న్యాయవ్యవస్థలతో పోరాడుతోంది. ఈ కేసులోని వాస్తవాలు.. ప్రతీ ఒక్కరికీ ప్రతి ఒక్కరికీ కంటి తెరుపు. నిందితుడితో బాధితురాలికి ఉన్న భావోద్వేగ అనుబంధం, వారి ప్రస్తుత కుటుంబ జీవితంతో సహా అసాధారణ పరిస్థితులు పరిగణనలోకి తీసుకుని ''పూర్తి న్యాయం'' అందించేందుకు ఆర్టికల్ 142 కింద అధికారాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా,జస్టిస్ ఉజ్జయ్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. తద్వారా అతని శిక్ష రద్దు చేస్తున్నట్లు జస్టిస్ ఓకా తీర్పు వెల్లడించారు.

**సంచలన కేసుగా..**

పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక వ్యక్తి తన 24 ఏళ్ల వయసులో 15 ఏళ్ల మైనర్ బాలికతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే.. ఆ తర్వాత మైనార్టీ తీరాక ఆమెనే అతను వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆ జంట పిల్లలతో సంతోషంగా జీవిస్తోంది. అయితే అప్పటికే అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు అయ్యింది. కింది కోర్టులో 20 ఏళ్ల కారాగార శిక్షపడడంతో.. కేసు కలకత్తా హైకోర్టుకు చేరింది. అయితే.. 2023లో ఈ కేసు విచారణ సందర్భంగా సదరు వ్యక్తికి ఊరట ఇచ్చిన హైకోర్టు, తీర్పు ఇచ్చే ప్రయత్నంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. బాలికలు తమ లైంగిక కోరికలు అణుచుకోవాలంటూ వ్యాఖ్యలు చేసింది. ఈ తీర్పును సుమోటోగా తీసుకున్న సుప్రీం కోర్టు.. కోల్‌కతా హైకోర్టు వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టింది. కిందటి ఏడాది ఆగష్టులో హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసి నిందితుడికి శిక్షను పునరుద్ధరించింది. అయితే బాధితురాలు/అతని భార్య విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని శిక్షను అమలు చేయకుండా.. ఈ కేసును ప్రత్యేకంగా పరిగణించింది. ఈ కేసులో బాధితురాలి ప్రస్తుత మానసిక స్థితి పరిశీలన కోసం నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయించింది సుప్రీం కోర్టు. ఏప్రిల్ సీల్డ్ కవర్‌లో అందిన ఆ నివేదికను పరిగణనలోకి తీసుకున్న ద్విసభ్య ధర్మాసనం తాజాగా.. బాధితురాలి భర్తకు ఊరట ఇస్తు తీర్పు వెల్లడించింది.

# ట్రంప్ ఐఫోన్లపై టారిఫ్ బాంబు

(మొదటి పేజీ తరువాయి)

టారిఫ్‌ల భారాన్ని తగ్గించుకునేందుకు ఐఫోన్ల తయారీని చైనా నుంచి భారత్‌కు మార్చాలని కుక్ నిర్ణయించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇలా టారిఫ్ బాంబు పేల్చారు. గత వారం పశ్చిమాసియాలో పర్యటన సమయంలోనే ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించడం తెలిసిందే. అమెరికా నిర్ణయంతో ఐఫోన్ల ధరలకు రెక్కలొచ్చే అవకాశం కన్పిస్తోంది. అదే జరిగితే ఫోన్ల అమ్మకాలు పడిపోయి సంస్థ లాభాలపై ప్రభావం పడనుంది. ట్రంప్ టారిఫ్‌లతో తలెత్తిన అనిశ్చితి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ఎలా స్పందించాలో తెలియక అమెజాన్, వాల్‌మార్ట్ వంటి దిగ్గజ కంపెనీలన్నీ ఇప్పటికే అయోమయంలో పడ్డాయి.

ఈయూపై 50% బాదుడు

యూరోపియన్ యూనియన్ (ఈయూ) పైనా ట్రంప్ మరోసారి టారిఫ్‌ల కొరడా ఝళిపించారు. ఈయూతో అమెరికా వాణిజ్య చర్చలు సజావుగా సాగడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 1 నుంచి అన్ని రకాల ఈయూ ఉత్పత్తులపైనా 50 శాతం టారిఫ్ అమల్లోకి రానుందని 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. అమెరికాలో తయారు చేసే వస్తువులపై ఎలాంటి టారిఫ్‌లూ ఉండవని సెలవిచ్చారు. ఈయూ దిగుమతులపై 10% పన్ను కొనసాగాలని ట్రంప్ పట్టుబడుతుండగా పూర్తిగా ఎత్తేయాలని ఈయూ కోరుతోంది. ఈ సమయంలో ఆయన ఉన్నట్టుండి ఇలా టారిఫ్ బాంబు పేల్చారు. చైనా మీదా ఇలాగే టారిఫ్‌లను ఆయన 145 శాతానికి తీసుకెళ్లడం, చివరికి 30 శాతానికి తగ్గించడం తెలిసిందే.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత..

-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** అభివృద్ధిలో ముందంజలో ఉన్న ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యతని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

శుక్రవారం మంత్రి, మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్ లోని పాండురంగాపురంలో పర్యటించి కోటి రూపాయలతో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పాండురంగాపురం ఖమ్మం నగరానికి దూరంగా ఉండేదని, నేడు కాలక్రమేణా అభివృద్ధి చెంది నగరంలో కలిసిపోయిందని అన్నారు. రెండు, మూడవ డివిజన్ లో అవసరమైన అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని అన్నారు.

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలను అమలు చేయాలని అన్నారు. రోడ్డు వెడల్పు, డ్రైయిన్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు ప్రజలను ఒప్పించి చేయని పక్షంలో నగరవాసులు వరదల సమయంలో మరొకసారి ఇబ్బందులకు గురవుతారని మంత్రి తెలిపారు.

50 సంవత్సరాల కాలం ఖమ్మం నగరం అభివృద్ధిని అంచనా వేస్తూ అవసరమైన త్రాగు నీరు, రోడ్లు, ఇతర మౌళిక వసతులు కల్పన చేయాలని అన్నారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో మురికి కాల్వలను శుభ్రం చేయాలని అన్నారు. పాండురంగాపురం ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుతూ, మొక్కలు పెంచుకుంటే మనకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని అన్నారు.

ప్రజలను ఒప్పించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, స్థానిక కార్పొరేటర్, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఆటంకాలను అధిగమించాలని అన్నారు. డ్రైయిన్ నిర్మాణ పనులకు వెంటనే పెగ్ మార్కింగ్ చేయాలని అన్నారు ప్రభుత్వ భూములు ఆక్రమణ గురి కాకుండా చూడాలని అన్నారు.

నగరంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు గ్రౌండింగ్ కావాలని, ప్రభుత్వం విడుదల చేసే నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, త్రాగునీటి సరఫరా కోసం మరో 220 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు.

ఖమ్మం నగరానికి చుట్టు పక్కల జాతీయ రహదారులు వచ్చాయని, రైల్వే కనెక్టివిటీ ఉందని, మంచి వైద్య సదుపాయాలు, విద్యా సంస్థలు ఏర్పడ్డాయని, వైద్య కళాశాల, స్టేడియం నిర్మాణం జరుగుతున్నాయని అన్నారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపై ఉందని అన్నారు

మతాలు, కులాల మధ్య గొడవలు పెట్టి పబ్బం గడుపుకోవాలి అనుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి తెలిపారు. ప్రజలంతా సోదరుల్లా కలిసి ఉంటేనే ఆనందంగా ఉంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం ఆర్డిఓ నరసింహారావు, కార్పోరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, సైదులు, దుద్దుకురి వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# రెడ్ క్రాస్ సొసైటీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:** రెడ్ క్రాస్ సొసైటీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.


శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నూతన భవనానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్లడ్ స్టోరేజ్ సెంటర్, రెడ్ క్రాస్ సొసైటీ బిల్డింగ్ నిర్మాణ పనులను ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వైద్యులుగా తమకు రక్తం విలువ తెలుసునని అన్నారు. తాను బ్లడ్ స్టోరేజ్ సెంటర్లో వైద్యురాలిగా పనిచేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర గవర్నర్ సూచించారని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు జిల్లాలలో రెండు జిల్లాలు హనుమకొండ, వరంగల్ లలో రెడ్ క్రాస్ సొసైటీలు ఉన్నాయని అన్నారు. అదే విధంగా భూపాలపల్లి, జనగామ జిల్లాలలో కూడా వీటిని ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. థలసేమియా బాధితులకు ఎప్పటికప్పుడు రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. థలసేమియా భారీన పడిన చిన్నారులకు అప్పుడప్పుడు రక్తం లభించకపోవడంతో హైదరాబాద్ కు వెళ్తుంటారని పేర్కొన్నారు. అట్లాంటి వారందరికీ రెడ్ క్రాస్ ద్వారా సేవలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెడ్ క్రాస్ సేవలు మరింతగా విస్తరించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీకి ప్రజాప్రతినిధులుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రెండు రోజుల క్రితం ఇక్కడ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డిజబులిటీ సెంటర్ తో పాటు థలసేమియా సెంటర్ను ఏర్పాటు చేయాలని తనకు వినతి పత్రాన్ని అందించారని పేర్కొన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున ఢిల్లీ కి వచ్చినట్లయితే హెల్త్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి వాటి ఏర్పాటుకు కృషి చేద్దాం అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ కొత్త తరహా సేవలను కృషి చేయాలని, ఇందులో భాగంగా మేనుస్ట్రువల్ హైజిన్ తో పాటు కౌమార దశ బాలికలకు రక్తహీనత ఏర్పడుతుంది కాబట్టి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ పెరగడానికి ఐరన్ మాత్రలను అందించాలన్నారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. చిన్నచిన్న కేంద్రాలలో ముందుగా ఈ సేవలను ప్రారంభించాలన్నారు. ఇలాంటివి చేపట్టినట్లయితే రెడ్ క్రాస్ సేవలు పెరిగినట్లు అవుతాయని అన్నారు. డ్రగ్స్ మహమ్మారి పట్ల అవగాహన కల్పించాలని కోరారు. డి అడిక్షన్ సెంటర్ ను ప్రారంభించాలని కోరుతున్నట్లు తెలిపారు. వివిధ రకాల సేవలను అందించడం ద్వారా రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రతి ఊరి చివరి వరకు చేరతాయన్నారు. వివిధ రకాల సేవలను అందించడం ద్వారా సమాజాన్ని ఆదుకున్న వారవుతారని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించి అవసరార్థులకు అందజేయాలన్నారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్లో రక్త నిల్వలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల పట్టణంలో కోటిన్నర నిధులతో ఆధునిక వసతులతో బ్లడ్ స్టోరేజ్ సెంటర్, రెడ్ క్రాస్ సొసైటీ భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సేవా భావంతో రెడ్ క్రాస్ సొసైటీ ముందుకెళ్తుందని చెప్తున్నారు. పరకాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఆపద సమయంలో ఆదుకునే సొసైటీగా రెడ్ క్రాస్ కు ప్రజలలో మంచి పేరు ఉందన్నారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలిచిన వారవుతారని అన్నారు. పరకాల చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలలో అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి రక్త నిధి కేంద్రం అందుబాటులోకి వస్తుందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక స్పృహ కల్పించే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. సమాజానికి మనవంతు బాధ్యతగా యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. రక్తదానం పై అపోహలు వద్దని సూచించారు. ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వలన ఆరోగ్యం మరింత మెరుగవుతుందన్నారు. రక్తదానం పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రక్తదానం చేయడం వలన ప్రాణదాతలుగా నిలుస్తామన్నారు. రక్తదానం చేయడంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. పరకాలలో ఏర్పాటుచేస్తున్న బ్లడ్ స్టోరేజ్ సెంటర్ కు, అభివృద్ధి చేసేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని సొసైటీకి హామీ ఇచ్చారు. గ్రామాలలో గుడుంబా, డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలని, నిర్మూలనకు చైతన్యం తీసుకురావాలన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ నుండి బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటుకు లేఖ అందిందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీకి రాష్ట్ర గవర్నర్ చైర్మన్ గా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా బ్లడ్ బ్యాంక్ ఉండాలని లేఖ వచ్చిందన్నారు. హనుమకొండ జిల్లాలో హనుమకొండతో పాటు రెండో బ్లడ్ బ్యాంకు పరకాలలో ప్రారంభం చేసుకున్నామని అన్నారు. రెడ్ క్రాస్ లాంటి సొసైటీల ద్వారా రక్తదాన శిబిరాల నిర్వహణతో రక్త నిధికి చేరుతుందని అన్నారు. పరకాలలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలతో పాటు భూపాలపల్లి వరకు ఉపయోగపడుతుందన్నారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్ పరకాల సివిల్ ఆసుపత్రికి అనుసంధానమై ఉంటుందన్నారు. ఈ సెంటర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సమాజానికి ఉత్తమ సేవలను అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ నారాయణ, సిహెచ్సి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహన్, హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, ప్రతినిధులు బొమ్మినేని పాపిరెడ్డి, ఇ.వి. శ్రీనివాసరావు, డాక్టర్ సంధ్యారాణి, వేణుగోపాల్, డాక్టర్ శేషు మాధవ్, రమణారెడ్డి, ఇతర సభ్యులతో పాటు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఖమ్మం ఎంపీ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడు గ్రామానికి చెందిన తప్పెట్ల పెద్ద వెంకన్న కుమారుడు ప్రవీణ్ కుమార్ వివాహం మరిపెడ బంగ్లాలోని భార్గవ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం జరగ్గా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంతకుముందు ఆర్ అండ్ బీ అతిథి గృహంలో పార్టీ నాయకులను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రామ్ లాల్, సత్యనారాయణ రెడ్డి, చాపల యాదగిరి రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, కుడితి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ కొమ్మూరి గోపాలరావు మాతృమూర్తి మృతి

**మాజీ ఎంపీ నామ సంతాపం**



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఎర్రపాలెం మండలం రామాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొమ్మూరి గోపాలరావు మాతృమూర్తి సుశీలమ్మ శుక్రవారం కన్నుమూశారు. ఈ వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సుశీలమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన ఆయన, గోపాలరావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.



# యూటీ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** పాలేరు సాగర్ కాలువ వద్ద జరుగుతున్న యూటీ పనులను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మంత్రి గత సెప్టెంబర్ 1న వచ్చిన అకాల వరదలకు పాలేరులో సాగర్ కాలువకు గండ్లు పడటంతో యూటీ పూర్తిగా కూలిపోయింది. కాగా మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు అధికారులు పనులు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆకస్మాత్తుగా పనుల పరిశీలనకు వచ్చారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పనులు జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తి వర్షాకాలం వచ్చేసరికి మొత్తం పనులు పూర్తి చేయాలని వచ్చే 15 నుండి 20 రోజుల్లో 24 గంటలు రెండు షిఫ్ట్ పని జరిగేలా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.అనంతరం పాలేరులో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.



# కర్ణాటకలో సైబర్ నేరస్థుడిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామని ఖమ్మంకి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి, డిజిటల్ అరెస్టు చేసి సుమారు 1.12 కోట్ల రూపాయలు దోచుకున్న కేసులో వ్యక్తిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు కర్ణాటకలోని హుబ్లీలో అరెస్టు చేసినట్లు సి.పి. సునీల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం అర్బన్ మండలంలోని టీచర్స్ కాలనికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి అయిన నాగుల బ్రహ్మం గారికి ఫోన్ లో మనీ లాండరింగ్ పాల్పడారని, ముంబాయి పోలీసులమని, అరెస్టు చేస్తామని బెదిరించి, అక్టోబర్ 2024 లో ఫలు ధఫాలుగా సుమారు 1.12 కోట్ల రూపాయలు దోచుకున్న కేసులో రూ. 32 లక్షలు అకౌంటికి వెళ్ళిన మహ్మద్ జాఫర్ బెల్గాం, వయస్సు 40 సం॥ రాల వ్యక్తిని కర్ణాటకలోని హుబ్లీలో అరెస్టు చేసినట్లు, నిందుతున్ని సైబర్ క్రైమ్ కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ కి తరలించారు అని తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించి, కర్ణాటకలోని హుబ్లీలో నిందుతున్ని అరెస్టు చేసి, ఖమ్మంకి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా తీసుకువచ్చిన సైబర్ క్రైమ్ డి. ఎస్పీ, సి హెచ్ ఆర్ వి ఫణిందర్ ని, ఎస్సై రంజిత్ కుమార్ ని, సహకరించిన ఎస్సై విజయకుమార్ మరియు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సి.పి. అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# రైతుల అరెస్టును ఖండించిన మాజీ మంత్రి హరీష్ రావు

**సంగారెడ్డి జిల్లా / జహీరాబాద్ తెలంగాణ ముచ్చట్లు.** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జహీరాబాద్ పర్యటన సందర్భంగా రైతులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రేవంత్ రెడ్డి పర్యటన జరిగిన ప్రతిసారీ ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు ఎందుకు.? ఇదేనా ప్రజాపాలన అంటే? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.
మొన్న నాగర్‌కర్నూల్ పర్యటనలో చెంచు సోదరులను అక్రమంగా అరెస్టు చేశారు. నేడు జహీరాబాద్‌లో రైతులను, రైతు నాయకులను అరెస్టు చేశారు. జహీరాబాద్ నిమ్స్ చుట్టూ ఉన్న గ్రామాలను అష్ట దిగ్బంధనం చేసి, రైతు నాయకులను నిర్బంధించడం ఏ విధంగా ప్రజాపాలన అవుతుంది? ఇది ప్రజాపాలన కాదు, ప్రజలను పీడించే పాలన. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తన ఆవేదనను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉంది. ఈ హక్కును హరించడం దుర్మార్గం. నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు, అరెస్టులు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన జరిగే పరిస్థితి లేదు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను, రైతు నాయకులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, తెలంగాణ డీజీపీని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.





# భూభారతి దరఖాస్తుల విచారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:** భూభారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత రైతులకు నోటీసులు అందించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా నడికూడ మండల తహసిల్దార్ కార్యాలయంలో పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, స్థానిక తహసిల్దార్ రవీందర్ రెడ్డి, సిబ్బందితో భూభారతి దరఖాస్తుల విచారణ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పైలట్ మండలమైన నడికూడ మండలంలోని వివిధ గ్రామాలలో స్వీకరించిన భూభారతి దరఖాస్తుల విచారణ గురించిన వివరాలను అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులలో వచ్చిన అన్ని అప్లికేషన్లకు నోటీసులు అందించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలన్నారు. విచారణ అనంతరం తగు ఉత్తర్వులు జారీ చేసి వాటి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అప్లికేషన్ల విచారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అదనపు సిబ్బందిని కేటాయించాలన్నారు. సమీక్ష సమావేశం అనంతరం ఇదే మండలంలోని రాయపర్తి గ్రామంలో భూభారతి దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసిన విచారణ బృందం చేపడుతున్న విచారణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ గ్రామానికి చెందిన రైతు రాజేశ్వరరావు తో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# బాల సదనం నుండి అమెరికకు దత్తత

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఆధ్వర్యంలో జరిగింది, సంబంధిత వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అనుబంధ శిశు గృహ, బాల సదనంలో ఆశ్రయం పొందుచున్న బాలిక (10) వివరాలను కేంద్ర దత్తత వనరుల విభాగంకు ఆన్లైన్ చేయగా అమెరిక దేశానికి చెందిన దంపతులు అంతర్ రాష్ట్ర దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా దరఖాస్తును పరిశీలించిన కేంద్ర దత్తత వనరుల విభాగం సీనియారిటీ ప్రకారం గతంలో శిశు గృహ, బాలసదనంలో రక్షణ సంరక్షణ పొంది నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్ కంట్రీ ఆడాప్షన్ అందించడం



జరిగింది.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమని అందుకు చట్ట బద్ధమైన దత్తత ప్రధాన మార్గమని, పిల్లలు లేని దంపతులు చట్ట బద్ధమైన దత్తతను తీసుకోవాలని అన్నారు.
జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి మాట్లాడుతూ ఇప్పటి వరకు 10 మంది పిల్లలను ఇంటర్ కంట్రీ అడాప్షన్ లో భాగంగా ఇటలీ, మాల్టా, లండన్, అమెరిక దేశాలకు దత్తత ఇచ్చామని అన్నారు.
కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సందసాని రాజేంద్ర ప్రసాద్, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, బాల సదనం సూపరింటెండెంట్ ఎం కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, దత్తత కేంద్రం సోషల్ వర్కర్ సంగి చైతన్య తదితరులు పాల్గొన్నారు.




# లా కాలేజీ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎస్ డి ఎం లా కాలేజీ విద్యార్థులను శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానించారు. ఇటీవల విడుదలైన మొదటి సంవత్సరం, మూడవ సంవత్సరం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన 22 మంది విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే కలెక్టర్ కార్యాలయంలో వారిని శాలువాలు, మెడల్ లతో సన్మానించి అభినందించారు.పాలమూరు యూనివర్సిటీ పరిధిలో వచ్చే ఈ లా కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

# బడిబాట కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:** జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచే విధంగా బడిబాట కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రానున్న విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచే విధంగా చేపట్టనున్న బడిబాట కార్యక్రమం పై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమ నిర్వహణకు ప్రణాళిక అవసరమని, తహసిల్దార్, ఎంపీడీవోలు, ఎంఈఓ లు సమన్వయంతో కార్యక్రమాలను విజ



యవంతం చేయాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలు సమావేశాన్ని నిర్వహించుకోవాలని, మండల ప్రత్యేకాధికారిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామాలలో బడిబాట పై అవగాహన కార్యక్రమాలు అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. బడిబాట కార్యక్రమాల నిర్వహణతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. జూన్ 6వ తేదీ నుండి వివిధ కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రగతిలో వెనకబడిన విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో కంప్యూటర్ విద్యా బోధన ద్వారా మెరుగుపరిచే విధంగా నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. పాఠశాలల విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు ప్రభుత్వ, కేజీబీవీ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ చదివేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పాఠశాలలకు అవసరమైన వసతుల కల్పన విషయమై ఎంపీడీవోల దృష్టికి తీసుకెళ్లి ఎంఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.
ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమాల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి వివిధ అంశాల గురించి సంబంధిత శాఖల అధికారులకు వివరించారు.
ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యాలత, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎంఈవోలు, తర అధికారులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**-హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:** ఈ నెల 25వ తేదీన జరగనున్న యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష, గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన జరిగే యూపిఎస్సి సివిల్స్ ప్రిలిమ్స్, గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్షల నిర్వహణకు కేటాయించిన పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనల మేరకు ఏర్పాట్లు ఉండాలని అన్నారు. పరీక్ష నిర్వహణకు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద తగిన పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. రెండు పరీక్షలు నిర్వహణ దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష ఈనెల 25వ ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు మొదటి సెషన్ పరీక్ష, మధ్యాహ్నం రెండున్నర నుండి 4:30 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష ను 4141 మంది అభ్యర్థులు రాయనున్నారని పేర్కొన్నారు. యూపీఎస్సీ పేర్కొన్న నిర్ణీత సమయంలో పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. అదేవిధంగా ఈనెల 25వ తేదీన గ్రామ పాలన ఆఫీసర్స్ టెస్ట్ 2025 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్ష ఉంటుందన్నారు. 132 మంది అభ్యర్థులు ఈ పరీక్షను రాయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పాలన ఆఫీసర్స్ టెస్ట్ నిర్వహణ కు హనుమకొండ లోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్, గ్రామ పాలన ఆఫీసర్స్ టెస్ట్ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై వి గణేష్, యూపీఎస్సీ అధికారి కేశ్ రామ్ మీనా , ఏసిపి నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ ను అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాదరావు సందర్శించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఆయన స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, విచారణలో వున్న కేసులు, చార్జిషీట్, 5s అమలు, హెచ్ ఆర్ ఎం ఎస్, సీసిటివి, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. .స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు, పోలీస్ స్టేషన్ అవరణలో వున్న కేసులకు సంబంధించిన వాహనాలు పరిశీలించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్ధుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సరిహద్దుల నుండి అక్రమ రవాణా ను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు.

# చెక్ పోస్ట్ లను తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్

**పశువుల రవాణా విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** పశువుల అక్రమ రవాణా నియంత్రణకు జిల్లా సరిహద్దులలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాదరావు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పశువుల అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా మండలం పాలడుగులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను శుక్రవారం సందర్శించిన అడిషనల్ డీసీపీ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... అక్రమ రవాణా నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో 24x7 నిరంతర పర్యవేక్షణ వుండాలని అన్నారు. పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను పోలీసులు మినహా ఏ సంస్థలు/ కార్యకర్తలు



వాహనాలను స్వయంగా ఆపకూడదని, నిబంధనలు విరుద్ధంగా అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. సరిహద్దు చెక్ పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు సీజ్ చేస్తారని అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కారించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా, మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# అసంఘటిత భవన కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రస్థాయి సమావేశం

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:** కరుణపురంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల రాష్ట్రస్థాయి సమావేశంలో కార్మికుల సమస్యలు, సంక్షేమం ప్రధాన అంశాలుగా చర్చించబడ్డాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ధరిపెల్లి చంద్రం మాట్లాడుతూ, కార్మికులంతా ఏకతాటి పై చేరి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, వారి సమస్యలను ఈ నెల 26వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బిఎన్ఆర్కెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కార్మికుల కోసం రూ. 6 లక్షల ప్రమాద బీమా, రూ. 2000 పెన్షన్ సౌకర్యం ప్రకటించినా, అసలు సమస్యల




పరిష్కారం ఇంకా మిలకగానే ఉందని అన్నారు. సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు పూర్తిస్థాయిలో పథకాలు అందాలన్నదే కోరడమని వెల్లడించారు. అసంఘటిత భవన నిర్మాణ కార్మికులు అందమైన భవనాలు నిర్మిస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారని, వారి కష్టార్జిత నిధుల ఆధారంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నప్పటికీ, అసలు లబ్ధిదారులు అందులో తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. గత పదేళ్లలో కార్మిక శాఖ నిధులను ఇతర శాఖలకు మళ్లించడంతో, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసిన వారికి నిధుల కొరత వల్ల మంజూరు జరగకపోవడం బాధాకరమని వివరించారు. కరోనా సమయంలో కార్మిక కుటుంబాలకు కనీసం రూ. 1000 చొప్పున ఆర్థిక సాయం అందించాలన్న డిమాండ్‌కు స్పందన లేకపోవడం, లేబర్ కార్డులు నిజమైన కార్మికులకు కాకుండా సంబంధం లేని వ్యక్తులకు మంజూరవడం, దళారుల వల్ల వాస్తవ కార్మికులు నష్టపోవడం వంటి విషయాలను వివరంగా పేర్కొన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని, కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయంగా అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉందని, వచ్చే 26వ తేదీన జరగబోయే కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సోదరులు తరలిరావాలని గిన్నారపు మహేందర్ పిలుపునిచ్చారు.



## సరస్వతి పుష్కరాల్లో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్

**జయశంకర్ భూపాలపల్లి తెలంగాణ ముచ్చట్లు:**
కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కరాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజున మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి, శుభనంద దేవి సరస్వతి ఆలయాల్లో దర్శనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, బీజేపీ నాయకుడు ప్రదీప్ రావు త్రివేణి సంగమంలో స్నానం ఆచరించి, శ్రీ కాళేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతి ఘాట్ వద్ద కాశీ పండితుల సమక్షంలో నవరత్న మాల గంగా హారతిలో పాల్గొన్నారు.
ఈ గంగా హారతి భక్తులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు సాయంత్రం వరకు వేచి ఉండి భక్తిశ్రద్ధలతో గంగా హారతిని తిలకిస్తున్నారు. పూజా కార్యక్రమాలు పూర్తి అయిన అనంతరం భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని, పుష్కరాల నిర్వహణపై పూర్తి సమీక్ష చేసి మెరుగైన ఏర్పాట్లు చేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు.

## మద్దిగట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా మొగులయ్య

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
పెద్దమందడి మండల పరిధిలోని మద్దిగట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా మొగులయ్యను ఎంపిక చేశారు.. ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో అధ్యక్షునిగా మొగులయ్యను ఎంపిక చేసినట్లు మాజీ సర్పంచ్ పుట్ట మోనీ నారాయణ, మాజీ ఎంపీటీసీలు రామచంద్రయ్య గౌడ్, చాపల సత్య రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్న కేశవులు కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగన్న యాదవ్ కేశవులు గౌడ్ మాజీ ఉపసర్పంచ్ శివరాజు రాములు గౌడ్. నగేష్ యాదవ్ బాలయ్య జనార్ధన్ తదితరులున్నారు.. నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన మొగులయ్య మాట్లాడుతూ.. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మెగా రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.



## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

- డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభం
- దళిత రత్న అవార్డు గ్రహీత వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
వైరాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నేడే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులకు సింగరేణి కాలరీస్ సహకారంతో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చొరవతో స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఏడో తరగతి నుండి డిగ్రీ ఫార్మసీ ఐటీ డిప్లమో పదవ తరగతి ఇంటర్మీడియట్ డిగ్రీ పీజీ చేసిన విద్యార్థులకు చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలని దళిత రత్న అవార్డు గ్రహీత వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి నిరుద్యోగులను కోరారు ఈ చక్కటి అవకాశాన్ని ఐదువేల ఉద్యోగాలతో 80 ప్రవేట్ కంపెనీల సహకారంతో వైరాలో చాలా బ్రహ్మాండంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు ఈ అవకాశాన్ని సర్టిఫికెట్లతో మీరందరూ వినియోగించుకోవాలని మీ అర్హతను బట్టి ఉద్యోగం సంపాదించి మీ కుటుంబానికి అండగా ఉండాలని ఏర్పాట్లను స్వయంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ పిసిసి కార్యదర్శి నూతి సత్యనారాయణ ఏ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారని వారు తెలిపారు.

# ఖమ్మం నియోజకవర్గంలో పర్యటించిన మాజీ మంత్రి పువ్వాడ..

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం ఖమ్మం నగరం మరియు రఘునాథపాలెం మండలం, చింతకాని మండలం నందు పర్యటించి పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఖమ్మం తెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ నాయకుడు దోకుపర్తి సుబ్బారావు కుమార్తె లోహిత వివాహ వేడుకకు హాజరై వధువుకు చీరాసారే సమర్పించి 50వేల రూపాయలు పెళ్లి కానుక అందజేసి వధువును ఆశీర్వదించారు. ఖమ్మం హర్ష కన్వెంక్షన్ నందు అడ్వాకేట్ అయితం రవీంద్ర కుమారుడు తరుణ్ రామ్ సిరివెన్నెల వివాహనికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. చింతకాని మండలం కోదుమూరు గ్రామం నందు దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు బడే సాహెబ్ కుమారుడు ఆరిఫ్ హుస్సేన్ అమిషా బేగం వివాహనికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. రఘునాథ పాలెం మండలం కోయచెలక గ్రామం నందు బిఆర్ఎస్ నాయకుడు అమరం వెంకటేశ్వర్లు కుమారుడు సందీప్ త్రివేణి వివాహనికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఖమ్మం ప్రకాష్ నగర్ దడాల మహేష్ ఇటీవల మమత హాస్పిటల్ నందు శస్త్ర చికిత్స చేయించుకున్నారు వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం రూరల్ మారెమ్మ తల్లి టెంపుల్ నందు కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ మనవడు వేదాన్ష్ అన్నప్రాసన మహోత్సవానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,మండల అధ్యక్షుడు వీరునాయక్,మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ,మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, దోన్వాన్ రవి,జిల్లా మైనారిటీ అధ్యక్షుడు తాజుద్దీన్,యూత్ అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి,ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్,సినీయర్ నాయకులు అమరగాని వెంకన్న,మాజీ సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్,మెంటం రామారావు ,కొంటెముక్కల వెంకటేశ్వర్లు,చెరుకూరి ప్రదీప్, నాయకులు గొల్లపూడి రాంప్రసాద్, చిలకల వెంకటనర్సయ్య, దడాల రఘు, పాలడుగు పాపారావు, కొప్పెరా నరసింహారావు, పత్తిపాక రమేష్,ఎర్రా అప్పారావు,కోడి లింగయ్య,మాటేటి కిరణ్, షకీనా,ఉస్మాన్,ఆరెంపుల వీరభద్రం,భూక్యా అశోక్, వీరేందర్,జానీ,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి...

## ఆర్ అండ్ ఆర్ కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు.
శుక్రవారం జిల్లా కలెక్టరెట్ లో ఆర్ అండ్ ఆర్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా ఆర్ అండ్ ఆర్ కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ మున్నేరు నదిపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్, సీతారామ ఎత్తి పోతల పథకం, జాతీయ రహదారుల నిర్మాణం వంటి వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ నిర్వాసితులతో నేరుగా చర్చిస్తూ ఎటువంటి ఆందోళనలు జరగకుండా సానుకూల వాతావరణంలో భూ సేకరణ ప్రక్రియ జరిగేలా చూడాలని అన్నారు.
సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా యాతాలకుంట టన్నెల్, పాలేరు రిజర్వాయర్ లింక్, డిస్ట్రిబ్యూషన్ కేనాల్స్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ చేపట్టేందుకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. రైతులకు పరిహారం అందించే అంశంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, చట్ట ప్రకారం సంపూర్ణ పరిహారం రైతులకు అందేలా అధికారులు పనిచేయాలని, భూ సేకరణ అంశంలో మానవీయ కోణంలో అధికారులు వ్యవహరించాలని అన్నారు.
ఈ సమావేశంలో ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి. నర్సింహారావు, ఎల్. రాజేందర్ గౌడ్, ఇర్రిగేషన్ అధికారులు, కలెక్టరేట్ భూ సేకరణ విభాగ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యం..

## ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
అర్హులైన పేద వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి శుక్రవారం సత్తుపల్లి లోని రాణి ఫంక్షన్ హాల్ లో, వేంసూరు లోని ఉన్నత పాఠశాలలో ఆవరణలో.. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. సత్తుపల్లి పట్టణం లో 369 మందికి మరియు సత్తుపల్లి మండలం లోని అన్ని గ్రామాల వారీగా మొత్తం 581 మందికి, వేంసూరు మండలంలో 618 మందికి పేద కుటుంబ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు.
ఈ సందర్భంగా ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకోలేదని అన్నారు. పదేళ్ళ పదవీకాలంలో కాలయాపన చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చాక.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపును పేదలు ఒక పండుగలా చేసుకోగలుగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# మండల మహిళా సమైక్య నూతన కార్యవర్గం ఎన్నిక..

**నూతన మహిళ సమైక్య కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఏపిఎం శకుంతల**

**మెదక్ బ్యూరో, టేక్మాల్ తెలంగాణ ముచ్చట్లు:** టేక్మాల్ మండల కేంద్రంలో మండల సమైక్య మహిళ భవనంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది ఇందులో భాగంగా ఎన్నికల అధికారి టేక్మాల్ ఏపిఎం శకుంతల, సీసీలు పాల్గొని కొత్తగా ఎన్నుకోబడిన సభ్యులను మహిళా సమైక్య నూతన పాలకవర్గ ఎన్నిక. మహిళ సమైక్య మండల అధ్యక్షురాలుగా నవనీత, ప్రధాన కార్యదర్శి గా అపర్ణ, కోశాధికారి శ్రావణి, మహిళా సమైక్య సభ్యుల సమక్షంలో ఎన్నుకోవడం జరిగిందన్నారు. సందర్భంగా ఏపిఎం శకుంతల మాట్లాడుతూ. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్ రెడ్డి, దుర్గయ్య, రామయ్య, స్వరూప, అకౌంటెంట్ భారతి కంప్యూటర్ ఆపరేటర్ జయపాల్ రెడ్డి, వివోఏలు ఆయా గ్రామా సంఘాల అధ్యక్షురాలకు పాల్గొనడం జరిగిందన్నారు.



శనివారం - 24 - మే - 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్వీట్లు తిన్న తర్వాత నీళ్లు తాగే అలవాటు ఉందా?



స్వీట్స్ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి.. దాదాపు ప్రతి ఒక్కరూ తీపి రుచులు ఆస్వాదించేవారే. అయితే మనలో చాలా మంది స్వీట్స్ తిన్న తర్వాత, వెంటనే నీళ్ళు తాగుతారు. ఇది దాదాపు అందరికీ ఉండే అలవాటు. స్వీట్స్ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి.. దాదాపు ప్రతి ఒక్కరూ తీపి రుచులు ఆస్వాదించేవారే. అయితే మనలో చాలా మంది స్వీట్స్ తిన్న తర్వాత, వెంటనే నీళ్ళు తాగుతారు. ఇది దాదాపు అందరికీ ఉండే అలవాటు. కానీ ఇలా స్వీట్లు తిన్న తర్వాత నీళ్లు తాగితే ఒంట్లో ఏమి జరుగుతుందో తెలుసా? ఒక్క మాటలో చెప్పాలంటే స్వీట్లు తిన్న తర్వాత వెంటనే నీళ్లు తాగడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. స్వీట్లు తినడం వల్ల శరీరంలో చక్కెర పరిమాణం త్వరగా పెరుగుతుంది. దీనిని షుగర్ స్పైక్ అంటారు. ఇది రక్తంలో చక్కెర సమస్యలతో బాధపడేవారికే మంచిది కాదు. అదే స్వీట్లు తిన్న తర్వాత నీరు త్రాగడం వల్ల ఈ చక్కెర స్పైక్ సమస్య మరింత అధికంగా ఉంటుంది. నిజానికి, ఏ రకమైన ఆహారాన్ని అయినా సులభంగా జీర్ణం చేసుకోవడానికి నీరు సహాయపడుతుంది. అందుకే తీపి పదార్థాలు సరిగ్గా జీర్ణం కావడానికి వాటిని తినడానికి ముందు లేదా తర్వాత నీరు త్రాగడం చాలా ముఖ్యం. స్వీట్లు తిన్నప్పుడల్లా దంత బ్యాక్టీరియా మరింత చురుగ్గా మారుతుంది. అందుకే స్వీట్లు తిన్న కాపేపటి తర్వాత నీళ్లు తాగడం వల్ల ఆ బ్యాక్టీరియా తొలగిపోతుంది. కేవలం స్వీట్లు మాత్రమే కాదు, ఏదైనా ఆహారం తిన్న ఆరగంట, గంట తర్వాత క్రమం తప్పకుండా నీరు త్రాగడం చాలా ముఖ్యం. అప్పుడు దంతాల ఆరోగ్యం బాగుంటుంది. దంత సమస్యలు ఉన్నవారు క్రమం తప్పకుండా దంతవైద్యుడిని సంప్రదించాలి. దంత సమస్యలను నివారించడానికి స్వీట్లు తినకపోవడమే మంచిది.



# గింజలు చిన్నవిగా ఉన్నా.. తింటే మాత్రం మస్తు లాభాలు ..!

చియా విత్తనాలు చిన్నవిగా కనిపించినా వాటిలో ఉన్న పోషక పదార్థాలు ఎంతో శక్తివంతంగా ఉంటాయి. మామూలుగా వీటిని ఉదయాన్నే తీసుకునే అలవాటు చాలా మందికి ఉంటుంది. కానీ రాత్రి నిద్రించే ముందు వీటిని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అద్భుతంగా ఉంటాయి. చియా గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. రాత్రి తీసుకునే ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా ఇవి సహాయపడతాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం ద్వారా కాలేయం ఉదయం సజావుగా పని చేయడానికి తోడ్పడుతుంది. మలబద్ధకంతో బాధపడే వారికి చియా గింజలు ఉపశమనం ఇవ్వగలవు. చియా గింజలు నీటిలో నానబెట్టిన తర్వాత దాదాపు పది రెట్లు పెరిగి జెల్ లా మారతాయి. ఇవి కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. ఫలితంగా రాత్రి వేళ ఎక్కువగా తినకుండా నియంత్రించవచ్చు. తక్కువగా తినడమే కాదు ఆరోగ్యాన్ని కూడా కాపాడటంలో ఇవి మంచి సహాయంగా ఉంటాయి. నానబెట్టిన చియా గింజలు నీటిని నిలిపి ఉంచే శక్తి కలిగి ఉంటాయి. శరీరం నిద్రలో ఉండగా నీరు కోల్పోకుండా రక్షిస్తాయి. ముఖ్యంగా వేసవిలో ఇవి ఎక్కువ ఉపయోగపడతాయి. రాత్రి చియా గింజలు తీసుకుంటే శరీరం హైడ్రేటెడ్ గా ఉండి ఉదయం తాజా భావన కలుగుతుంది. చియా విత్తనాల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, కాల్షియం, మెగ్నీషియం, ప్రోటీన్లు వంటి అనేక శక్తివంతమైన పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని శక్తివంతంగా ఉంచడంతో పాటు ఎముకలకు బలాన్ని అందిస్తాయి. రాత్రి తీసుకుంటే ఈ పోషకాలు నిద్ర సమయంలో శరీరంలో నెమ్మదిగా విడుదలవుతూ పని చేస్తాయి. ఈ విత్తనాల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది. ఇది శరీరంలో సెరోటోనిన్, మెలటోనిన్ అనే హార్మోన్లను ఉత్పత్తి చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఇది నిద్ర బాగా రావడానికి సహాయపడుతుంది. నిద్రలేమితో బాధపడే వారు ఈ చియా గింజలను తినడం వల్ల మంచి నిద్ర అనుభవించగలుగుతారు. చియా విత్తనాలు తిన్న తర్వాత శక్తిని క్రమంగా విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియ వల్ల రాత్రంతా గ్లూకోజ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇది ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి బాగా ఉపయోగపడుతుంది. బ్లడ్ షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా మారకుండా నియంత్రణలో ఉంచేందుకు ఇది సహాయపడుతుంది. చియా గింజలు చిన్నగా కనిపించినా వాటిలో ఉన్న శక్తి చాలా ఎక్కువ. రాత్రి వేళ నానబెట్టిన చియా గింజలను తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇది నిద్రకు తోడ్పడటమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరిచి, ఎక్కువగా తినే అలవాటు తగ్గిస్తుంది. శరీరాన్ని తేమగా ఉంచుతుంది.



# ఇవి తింటే అందం, ఆరోగ్యం..!


మామిడి తొక్కలో శరీరానికి అవసరమైన మంచి పోషకాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మామిడి తొక్కను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయట. విటమిన్ ఎ, సి, కె వంటి ముఖ్యమైన విటమిన్లు మామిడి తొక్కలో ఎక్కువగా ఉంటాయి. అంతే కాదు ఫోలేట్, మెగ్నీషియం, పొటాషియం, కోలిన్ వంటి ఖనిజాలు కూడా ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు మన శరీరంలో పోషకాల సమతుల్యతను అందించడమే కాకుండా జీర్ణవ్యవస్థను కూడా బలపరుస్తాయి. మామిడి తొక్కను తొక్క తీసుకోకుండా నేరుగా తింటే కష్టంగా ఉంటుంది. అందుకే తొక్కను చిన్న ముక్కలుగా కట్ చేసి నీటిలో ఉడకించి అందులో కొద్దిగా తేనె, నిమ్మరసం కలిపి తాగితే రుచిగా ఉంటుంది. ఇది రక్తాన్ని శుభ్రం చేయడంలో శరీరంలో ఉండే హానికర పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. రోజూ ఇలా తీసుకుంటే శరీరంలో కాలుష్యం తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుంది. మామిడి తొక్కలో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కూడా ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షణ ఇస్తుంది. ఇవి వివిధ రకాల జబ్బులు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలను నివారించడంలో సహకరిస్తాయి. అంతే కాకుండా ఇది శరీరంలో వృద్ధాప్య చర్యలను కూడా ఆలస్యం చేస్తుంది. ప్రతిరోజూ కూరగాయలతో మాత్రమే కాకుండా.. మామిడి తొక్కతో కూడా పచ్చడి చేయడం చాలా రుచికరంగా ఉంటుంది. తొక్కను సన్నగా తరిగి ఆవాల పొడి, ఉప్పు, మిరప పొడి నూనెతో కలిపి కొన్ని రోజులు నిల్వ ఉంచితే అద్భుతమైన పచ్చడి తయారవుతుంది. ఇది భోజనానికి మరింత రుచిని ఇస్తూ ఆకలిని పెంచుతుంది. ఈ పచ్చడితో మీరు సాధారణంగా తినే ఆహారం కంటే ఎక్కువ ఆహారం కూడా తినగలుగుతారు.మామిడి తొక్కలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారం శరీరంలో బాగా జీర్ణమై, అవసరమైన పోషకాలు సరిగ్గా శోషించబడతాయి. దీని వల్ల శరీరం బరువు పెరగకుండా తగినంత శక్తి పొందుతుంది. కాబట్టి బరువు నియంత్రణ చేయాలనుకునే వారికి మామిడి తొక్క చాలా ఉపయోగకరం. ఇంకో మంచి విషయం ఏంటంటే.. మామిడి తొక్కలో ఉన్న విటమిన్ సి చర్మ ఆరోగ్యానికి మంచిది. దీనివల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. మొటిమల సమస్యలు తగ్గిపోతాయి. వృద్ధాప్యం వల్ల వచ్చే ముడతలు కూడా తగ్గుతాయి. పరిశోధనల ప్రకారం గర్భిణీ స్త్రీల ఆరోగ్యానికి మామిడి తొక్క చాలా ఫలప్రదం. ఇది ఫోలేట్ ని అందించి శిశువు ఆరోగ్యంగా పెరగడానికి అవసరమైన పోషకం అందిస్తుంది. అందుకే గర్భధారణ సమయంలో సరైన మోతాదులో మామిడి తొక్కను తీసుకోవడం మంచిది. వంటల్లో కూడా మామిడి తొక్కను సులభంగా ఉపయోగించవచ్చు. పచ్చడి, చట్నీ రూపంలో తీసుకోవడం లేదా ఉడికించి తేనె, నిమ్మరసం కలిపి తాగడం వలన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దీన్ని తరచుగా ఆహారంలో చేర్చడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. మామిడి తొక్కలోని విటమిన్లు, ఖనిజాలు యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఇది మన ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# బరువు తగ్గాలంటే వాకింగ్, మైండ్ ఫ్రెష్ కావాలంటే యోగా..!



మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే.. ప్రతి ఒక్కరూ రోజూ కొంతసేపు శారీరక కదలికలు చేయడం అవసరం. అందులో ముఖ్యంగా వాకింగ్, యోగాసనాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచే రెండు ప్రముఖ మార్గాలు. వాకింగ్ అనేది ప్రత్యేకంగా నేర్చుకోవాల్సిన అవసరం లేని.. అందరూ సులభంగా చేయగలిగే వ్యాయామం. ఇది మన రోజువారీ జీవితంలో సాధారణంగా చేసే పనే అయినా.. దీనివల్ల ఆరోగ్యానికి చాలా లాభాలు ఉన్నాయి. ఉదయం సాయంత్రం కనీసం 30 నిమిషాలు నడిచే అలవాటు చేసుకుంటే.. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది చాలా ఉపయోగపడుతుంది. యోగా అనేది కేవలం శరీరానికి మాత్రమే కాదు.. మనసుకు కూడా శాంతిని ఇవ్వగల శక్తివంతమైన సాధన. ఇది భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి ఉన్న ప్రత్యేకమైన పద్ధతి. కొన్ని సంవత్సరాల క్రితం ఐక్యరాజ్యసమితి యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఇచ్చింది. యోగా చేసేటప్పుడు మన శరీరంలోని ఒత్తిడి తగ్గుతుంది అని శాస్త్రవేత్తలూ చెప్పారు. యోగా ద్వారా ప్రాణాయామం, ధ్యానం వంటి విధానాలు మనకు మనశ్శాంతిని అందిస్తాయి. ప్రతి రోజు కొద్దిసేపు వాకింగ్ చేయడం అలవాటు చేసుకుంటే శరీర బరువు తగ్గించడం సులభంగా చేయవచ్చు. నడక వలన శరీరంలో పేరుకుపోయిన అదనపు కేలరీలు త్వరగా ఖర్చవుతాయి. అలాగే నడకతో మెటాబాలిజం మెరుగవుతుంది. అంటే మనం తిన్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. నడక వల్ల షుగర్, బీపీ, గుండె సంబంధిత సమస్యలను కూడా కంట్రోల్ చేయడం సులభమవుతుంది. యోగాసనాలు శరీరాన్ని నిశ్చలంగా ఉంచడమే కాదు.. లోపల ఉండే శరీర వ్యవస్థలను సరిగ్గా పనిచేయించడంలో కూడా సహాయపడతాయి. యోగా చేసే వాళ్లు బాగా నిద్రపోతారు, ఒత్తిడి తగ్గుతుంది, మనసు ప్రశాంతంగా ఉంటుంది. దీర్ఘకాలంగా చేస్తే యోగాతో జీవనశైలి మారుతుం ది. మనశ్శాంతి పెరుగుతుంది, ఆరోగ్యం బాగుంటుంది, మనసు స్థిరంగా మారుతుంది. వాకింగ్ ప్రతి ఒక్కరూ ఏ వయసులో ఉన్నా సులభంగా చేయగలిగే సాధారణ వ్యాయా మం. ఇది శరీరానికి ఎక్కువ శ్రమ లేకుండా మంచి ప్రయోజనాలను ఇస్తుంది. యోగాను చేయాలంటే కొంత శిక్షణ అవసరం అయినా.. ఎవరు కావాలన్నా అభ్యాసం చేయవచ్చు. ప్రత్యేకంగా మనశ్శాంతిని కోరేవారు యోగా చేయడం మంచి ది. ప్రతిరోజూ కొంతసేపు నడక, కొంతసేపు యోగా చేస్తే శరీరానికి, మనసుకు పూర్తి ఆరోగ్యం లభిస్తుంది. వాకింగ్, యోగా రెండూ మన ఆరోగ్యాన్ని కాపాడే అద్భుత మార్గాలు. నడక శరీరాన్ని చురుకుగా ఉంచితే.. యోగా మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
శనివారం - 24 - మే - 2025
వరంగల్

## నాయకన్ తరవాత మరో క్లాసిక్ రాబోతుందా?


# 'థగ్ లైఫ్'పై భారీ అంచనాలు

'థగ్ లైఫ్' అంటూ ప్రేక్షకులను పలరించేందుకు సిద్ధమయ్యారు అగ్ర కథానాయకుడు కమల్ హాసన్ మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా జూన్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ప్రచారంలో పాల్గొన్న కమల్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మలయాళ ఇండస్ట్రీపై తనకున్న అభిమానాన్ని వివరించారు. పరిశ్రమలోని దిగ్గజ దర్శక నిర్మాతలతో వర్క్ చేయలేకపోయినందుకు బాధపడ్డారు. మలయాళ పరిశ్రమలో అవకాశాల గురించి మాట్లాడుతూ.. ''నా కంపెనీని నడపడానికి నేను ఇప్పటికీ సంపాదన వెంట పరుగెడుతున్నాను. నిజానికి నా దగ్గర ఉన్న డబ్బు కంటే ఎక్కువ అవసరం లేదు. కానీ, నా సినిమాలు తీయడానికి మరింత డబ్బు అవసరం. అందుకే ఆర్థికంగా బలపడడం కోసం మాలీవుడ్ ఇండస్ట్రీని ఎంచుకున్నాను. నేను ఒక విషయంలో దురదృష్టవంతుడిని. ఈ రంగంలోకి ప్రవేశించినప్పటికీ ఎం.టీ వాసుదేవన్ నాయర్, మృణాల్ సేన్ వంటి దిగ్గజాలతో నేను సినిమాలు చేయలేకపోయాను'' అని చెప్పారు. సినిమా ఫలితాల గురించి మాట్లాడుతూ.. ''నేను మూడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి నటించడం మొదలుపెట్టాను. ప్రతిరోజూ మంచి రోజుగానే భావిస్తాను. అందుకే సినిమా విడుదల రోజు ఆందోళన చెందను. ఈ పరిణితి అనుభవాన్ని బట్టి వస్తుంది. ప్రతి సినిమా విజయం సాధించాలని కోరుకుంటాం. భారీ బడ్జెట్‌తో దాన్ని నిర్మిస్తాం. ఒక్కోసారి అనుకున్న ఫలితం రాదు. అప్పుడు కొన్నిసార్లు ఆడియన్స్‌ను నిందిస్తాం. మరికొన్నిసార్లు మనల్ని మనమే నిందించుకుంటాం. దీన్ని అంగీకరించడానికి కొంత సమయం పడుతుంది. వయసు, అనుభవం మనకు ఎన్నో విషయాలు నేర్పుతాయి'' అని వివరించారు. 'నాయకన్' (1987) లాంటి హిట్ తర్వాత కమల్ మణిరత్నం కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. గ్యాంగ్‌స్టర్, యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కమల్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా నాయకన్ కంటే బాగుంటుందని కమల్ హాసన్ పలు ఇంటర్వ్యూల్లో ధీమా వ్యక్తంచేశారు.



## సంగీత్ శోభన్ కొత్త అవతారం..
## గ్యాంబ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో మిస్టరీ మూడ్

టాలీవుడ్ యంగ్ సంగీత్ శోభన్మ్యా డ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో నటించి బ్లాక్ బస్టర్ హిట్‌స్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం హీరోగా మారిన ఆయన ఓ సినిమా చేస్తున్నారు. సంగీత్ శోభన్, కేఎస్‌కే చైతన్య కాంబినేషన్‌లో రాబోతున్న లేటెస్ట్ చిత్రం 'గ్యాంబ్లర్స్'. అయితే ఇందులో ప్రశాంతి చారులింగహీరోయిన్‌గా నటిస్తోంది. రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత కీలక పాత్రలో కనిపించనున్నారు. సునీత, రాజ్ కుమార్ బృందావనం అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మిస్టరీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం థ్రిల్లింగ్, అంశాలు, ట్విస్టులతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేందుకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమా.. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా, ఈ మూవీకి సంబంధించిన డబుల్ అప్డేట్‌స్‌ను చిత్రబృందం షేర్ చేసింది. 'గ్యాంబ్లర్స్' సినిమా జూన్ 6న థియేటర్‌స్‌లోకి రాబోతుందని వెల్లడించారు. అలాగే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. ఇక ఇందులో సంగీత్ శోభన్ వైట్ షర్ట్‌పై బ్లాక్ కోట్ ధరించి క్యాప్ ధరించి చేతిలో గన్ పట్టుకుని వెరైటీ లుక్‌లో కనిపించాడు. వెనకాల ఓ టేబుల్ ఉండగా..ఇరు వైపులా రెండు పెయింటింగ్స్ ఉన్నాయి. ప్రస్తుతం సంగీత్ శోభన్ పోస్టర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.





## 'ఉస్తాద్' రీమేక్ కాదా?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో 'గబ్బర్ సింగ్' లాంటి బ్లాక్ బస్టర్ అందించిన దర్శకుడు హరీష్ శంకర్. మళ్లీ వీరి కలయికలో సినిమా అనౌన్స్ కావడానికి చాలా ఏళ్లు పట్టింది. అనేక నాటకీయ పరిణామాల తర్వాత అనౌన్స్ అయిన సినిమా సెట్స్ మీదికి వెళ్లడానికి కూడా తక్కువ సమయం ఏమీ పట్టలేదు. అలా షూట్ ఆరంభమయ్యాక మళ్లీ 'ఉస్తాద్ భగత్ సింగ్'కు బ్రేక్ పడిరది. ఎట్టకేలకు జూన్‌లో ఈ సినిమా తిరిగి సెట్స్ మీదికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఈ రోజు చిత్ర బృందం కూడా ధ్రువీకరించింది. ఒక ఆసక్తికర పోస్టర్‌తో త్వరలో షూటింగ్ పున:ప్రారంభం కానున్న విషయాన్ని ప్రకటించారు. ఐతే ఈ పోస్టర్‌లో అందరినీ ఒక విషయం ఆకర్షించింది. టైటిల్ కింద 'కథ-మాటలు-దర్శకత్వం' అని హరీష్ శంకర్ పేరు వేసుకున్నాడు. ఇక్కడే అందరికీ ఆశ్చర్యం కలుగుతోంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' స్ట్రెయిట్ మూవీ కాదన్నది స్పష్టం. తమిళ బ్లాక్ బస్టర్ 'తెరి' ఆధారంగా దీన్ని పునర్నిర్మిస్తున్నారు. ఈ విషయం రహస్యమేమీ కాదు. కాకపోతే హరీష్ శంకర్ రీమేక్‌ను రీమేక్‌లా తీయడు. కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్.. ఇలా అన్నీ మారుస్తాడు. ఎంత మార్చినా కూడా కథ విషయంలో ఒరిజినల్ రైటర్‌కే క్రెడిట్ ఇవ్వాల్సి ఉంటుంది. 'గబ్బర్ సింగ్'కు ఎంత మార్పులు చేసినా కూడా కథకుడిగా ఒరిజినల్ రైటర్‌కే క్రెడిట్ ఇచ్చారు. మాటలు, మార్పులు దర్శకత్వం అని కొత్త రకం క్రెడిట్ వేసుకున్నాడు హరీష్.

## భైరవం దర్శకుడి సారీ

ఈ నెల 30 విడుదల కాబోతున్న భైరవం దర్శకుడు విజయ్ కనకమేడల ట్రోలింగ్ బారిన పడ్డారు. ఎప్పుడో దశాబ్దం క్రితం తన సోషల్ మీడియా పేజీలో మెగా హీరోలను అవమానపరిచినట్టుగా కొన్ని స్క్రీన్ షాట్లు బయటికి రావడం మెగాభిమానులకు ఆగ్రహం కలిగించింది. దీంతో బాయ్ కాట్ భైరవం అంటూ ట్రెండిరగ్ మొదలుపెట్టారు. దీని వల్ల కలుగుతున్న డ్యామేజ్ పెద్దదవ్వడంతో విజయ్ కనకమేడల స్వయంగా స్పందించారు. ఎవరో హ్యాక్ చేసి ఉద్దేశపూర్వకంగా ఆ పోస్టులను పోస్ట్ చేశారని, ఇప్పుడు వాటితో తన సినిమాను చంపే ప్రయత్నం చేస్తున్నారని సుదీర్ఘమైన సందేశం విడుదల చేశారు. విజయ్ కనకమేడలకు పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ కు పని చేసిన అనుభవం ఉంది. సాయి ధరమ్ తేజ్ తో అన్నా అని పిలిపించుకునేంత చనువు ఉంది. తనకు సరిపడా కథ ఉంటే సినిమా చేద్దాం తీసుకురమ్మని సాయి చెప్పడం గురించి ఆయన ప్రస్తావించారు. అంతే కాదు చిరంజీవి, పవన్ కళ్యాణ్ సినిమాలు చూస్తూ పెరిగిన తాను మెగాభిమానులను దూరం చేసుకునే పనులు ఎందుకు చేస్తానని, కాకపోతే హ్యాక్ జరిగింది నా పేజీలోనే కాబట్టి ఇంకోసారి ఇలాంటివి జరగకుండా చూసుకుంటానని, ఫ్యాన్స్ ని క్షమాపణ కోరుతూ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. దీన్ని బట్టి అర్థం చేసుకోవాల్సింది ఒకటుంది. హీరోలు దర్శకులు ఇప్పటి సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటే సరిపోదు. గతంలో తాము పెట్టిన పోస్టులు ట్వీట్లలో ఏమైనా హ్యాక్స్ జరిగాయా లేక ట్రోలింగ్ అయ్యిందాని ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ ఉండాలి.





## "నీ జీవితం నీవే నిర్వచించుకో"..
## ఐశ్వర్య రాజేష్ ఇన్‌స్టాలో శక్తివంతమైన సందేశం!

ప్రతిభావంతమైన నటి ఐశ్వర్య రాజేష్ సోషల్ మీడియా వేదికగా తన అభిమానులతో ఓ బలమైన సందేశం పంచుకున్నారు. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫొటోను షేర్ చేస్తూ ఆమె "You define your own life. Don't let other people write your script" అనే శక్తివంతమైన కోట్‌ను క్యాప్షన్‌గా జత చేశారు. ఈ పోస్ట్ ఆమె వ్యక్తిత్వాన్ని, తన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని అభిమానులు భావిస్తున్నారు. ఈ మాటల ద్వారా – జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లు, ఇతరుల అంచనాలు మన లక్ష్యాలను నిర్ణయించకూడదని, మనం మనమే మన జీవన కథ రచించాలనే స్పష్టమైన సందేశాన్ని ఆమె ఇచ్చారు.
ఇటీవలే కొన్ని భిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మెప్పు పొందిన ఐశ్వర్య, ఈ పోస్టుతో మరింత ఇన్‌స్పిరేషన్‌ను పంచారు. అభిమానులు ఆమె పోస్ట్‌కు మంచి స్పందననిస్తుండగా, ఈ సందేశం ఎంతో మందిని ప్రభావితం చేస్తోంది.



## దళపతి చేజారింది..
# థగ్ లైఫ్ దొరికింది

అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని అంటూ మహాకవి ఆత్రేయ ఊరికే అనలేదు. నిన్న జరిగిన దగ్ లైఫ్ ప్రెస్ మీట్ లో తనికెళ్ళ భరణి అలాంటి సంఘటన ఒకటి పంచుకున్నారు. శివ నుంచి ఆర్టిస్టుగా పేరు తెచ్చుకున్న భరణికి 1991లో దళపతి రూపంలో అవకాశం తలుపు తట్టింది. సూపర్ స్టార్ రజనీకాంత్ %% మణిరత్నం కాంబినేషన్ అంటే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. కానీ లుక్ టెస్ట్, ఆడిషన్ చేశాక వయసు సరిపోదని భావించి భరణిని వెనక్కు పంపేశారు. దీంతో ఆయన తీవ్ర నిరాశ చెందారు. మళ్ళీ అవకాశం రాకపోదాని ఎదురు చూశారు కానీ అది దశాబ్దాల పాటు కలగానే ఉండిపోయింది.కట్ చేస్తే ముప్పై సంవత్సరాల తర్వాత పొన్నియిన్ సెల్వన్ తెలుగు స్క్రిప్ట్ కు పని చేసే అవకాశం దొరికింది. ఇదే అదునుగా భావించిన తనికెళ్ళ భరణి తనకు తరువాతి సినిమాలో కనీసం ఒక్క షాట్లో కనిపించే ఛాన్స్ ఉన్నా ఇమ్మని అడిగారు. నవ్వి ఊరుకున్న మణిరత్నం సమాధానం ఇవ్వలేదు. తర్వాత దగ్ లైఫ్ లో క్యారెక్టర్ ఉందంటూ పిలుపు వచ్చింది. ఏదైనా ఒక్క సీన్ చాలనుకుంటే ఏకంగా మంచి నిడివి ఉన్న పాత్ర ఇచ్చారు. దీంతో సుదీర్ఘంగా కన్న కల ఈ విధంగా నిజమయ్యింది. దళపతి పేరు తనికెళ్ళ భరణి ప్రస్తావించలేదు కానీ రజని మణిరత్నం కాంబోలో వచ్చిన సినిమా అదొక్కటే కాబట్టి ఈజీగా గెస్ చేయొచ్చు. ఈ రకంగా దగ్ లైఫ్ చాలా ప్రత్యేకతలు మోసుకొస్తోంది. జూన్ 5 విడుదల దగ్గర ఉండటంతో ప్రమోషన్ల వేగం పెంచారు. నాయకుడు కంటే గొప్పగా వచ్చిందని కమల్ హాసన్ చెబుతున్న మాటలు అంచనాలు పెంచేస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బెంగళూరుకు రైజర్స్ బ్రేక్









'ప్లే ఆఫ్స్'కు దూరమైన అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతోంది. గత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 'ప్లే ఆఫ్స్' ఆశలపై నీళ్లుచల్లిన రైజర్స్... శుక్రవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ని మరింత ముందుకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసింది. శుక్రవారం జరిగిన పోరులో సన్‌రైజర్స్ 42 పరుగుల తేడాతో బెంగళూరుపై గెలుపొందింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది.

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (48 బంతుల్లో 94 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) దంచికొట్టగా... అభిషేక్ శర్మ (17 బంతుల్లో 34; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అనికేత్ వర్మ (9 బంతుల్లో 26; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు.

అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు 19.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఫిల్ సాల్ట్ (32 బంతుల్లో 62; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (25 బంతుల్లో 43; 7 ఫోర్లు, 1 సిక్స్) ఆరంభంలో భయపెట్టినా... చివర్లో ఒత్తిడి పెంచిన రైజర్స్ ఫలితం రాబట్టింది. సన్‌రైజర్స్ కెపెటెన్ కమిన్స్ మూడు వికెట్లు పడగొట్టాడు.

**ఆరంభం నుంచే దంచుడు...**

ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగిన సన్‌రైజర్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. రెండో ఓవర్‌లో హెడ్ ఫోర్‌తో ఖాతా తెరవగా... భువనేశ్వర్ వేసిన రెండో ఓవర్‌లో హెడ్ ఫోర్, అభిషేక్ 4, 6 బాదారు. మూడో ఓవర్‌లోనూ అభిషేక్ 4, 6 దంచగా... నాలుగో ఓవర్‌లో ఈ జోడీ 4, 6, 4 కొట్టింది. వీరిద్దరూ మూడు బంతుల వ్యవధిలో అవుట్ కాగా... పవర్‌ప్లే ముగిసేసరికి రైజర్స్ 71/2తో నిలిచింది. క్లాసెన్ ఉన్నంతసేపు మెరుపులు మెరిపించగా... ఇషాన్ కిషన్ నిలకడ కనబర్చాడు.

సుయాశ్ శర్మ వేసిన 11వ ఓవర్‌లో అనికేత్ 6, 4, 6 కొట్టి కాసేపటికే ఔట్ కాగా... ఆంధ్ర ప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి (4) ప్రభావం చూపలేకపోయాడు. అభినవ్ మనోహర్ (12) కూడా ఎక్కువసేపు నిలవలేకపోగా... ఆఖర్లో బాదే బాధ్యత ఇషాన్ భుజాలకెత్తుకున్నాడు. 28 బంతుల్లో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్న కిషన్... చివర్లో మరింత వేగం పెంచి సెంచరీకి 6 పరుగుల దూరంలో నిలిచిపోయాడు.

**ఓపెనర్లు మినహా...**

పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన బెంగళూరు... భారీ లక్ష్యం కళ్ల ముందు కనిపిస్తున్నా ఏమాత్రం వెరవలేదు. తొలి రెండు ఓవర్లలో ఒక్కో ఫోర్ కొట్టిన కోహ్లి, మూడో ఓవర్‌లో రెండు ఫోర్లు దంచాడు. నాలుగో ఓవర్ వేసిన హర్షల్‌కు అదే శిక్ష వేశాడు.

కోహ్లి 7 ఫోర్లు కొట్టేవరకు ఒక్క బౌండ్రీ బాదలేకపోయిన సాల్ట్ ఆ తర్వాత జూలు విదిల్చాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి చాలెంజర్స్ 72/0తో నలిచింది. తొలి వికెట్‌కు 80 పరుగులు జోడించిన అనంతరం విరాట్ అవుట్ కాగా... పడిక్కల్ స్థానంలో జట్టులోకి వచ్చిన మయాంక్ అగర్వాల్ (11) ఎక్కువసేపు నిలవలేకపోయాడు.

27 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న సాల్ట్ కాసేపటికి వెనుదిరగగా... జితేశ్ శర్మ, రజత్ పాటీదార్ జోరు కొనసాగించారు. దీంతో 14 ఓవర్లు ముగిసేసరికి బెంగళూరు 163/3తో నిలిచింది. విజయానికి 36 బంతుల్లో 69 పరుగులు అవసరమైన దశలో... బెంగళూరు బ్యాటర్లు తడబడటంతో పరాజయం తప్పలేదు.








# దుమారం రేపుతోన్న పంత్, గిల్ షేక్ హ్యాండ్ వ్యవహారం..

పంత్‌ను విస్మరించడంపై చాలా మంది వినియోగదారులు తీవ్రంగా కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఇది ఇద్దరు భారత సహచరుల మధ్య స్నేహపూర్వక పరిహాసమని సూచించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. సోషల్ మీడియాలో కొన్నిసార్లు చిన్న విషయాలు కూడా పెద్ద చర్చకు దారితీస్తాయి. భారత యువ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విషయంలోనూ ఇలాంటిదే జరిగింది. గుజరాత్, లక్నో మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌తో గిల్ కరచాలనం చేసిన తీరు పలువురు అభిమానులకు నచ్చలేదు. పంత్‌ను గిల్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశాడని, ఇది అహంకారపూరిత చర్య అని కొందరు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. ఈ సంఘటనతో ఇంటర్నెట్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గురువారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 33 పరుగుల తేడాతో విజయం సాధించి, వరుసగా 4 నాలుగు మ్యాచ్‌ల ఓటములకు తెరదించింది లక్నో సూపర్ జెయింట్స్. లక్నో విజయానికి హీరోగా సెంచరీ హీరో మాచెల్ మార్ష్ నిలిచాడు. ఈ మ్యాచ్ మార్ష్, లక్నోకు బాగా కలిసొచ్చినప్పటికీ, మ్యాచ్ తర్వాత శుభ్‌మాన్ గిల్, రిషబ్ పంత్ మధ్య జరిగిన కొద్దిపాటి వాగ్వాదం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించింది.



కొన్ని సెకన్ల పాటు కొనసాగిన జరిగిన ఈ సీన్‌లో.. గిల్ ఆచారం ప్రకారం కరచాలనం చేస్తున్న సమయంలో పంత్‌ను దాటి నడిచినట్లు కనిపించాడు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ కొన్ని మాటలు మాట్లాడటానికి ఆసక్తిగా ఉన్నట్లు కనిపించాడు. గిల్ వేగంగా తదుపరి ఆటగాడి వైపు కదిలాడు. పంత్ తన వైపు తిరిగి చూడమని ప్రేరేపించాడని వీడియోలో తెలుస్తోంది .ఈ క్రమంలో పంత్‌ను విస్మరించడంపై చాలా మంది వినియోగదారులు తీవ్రంగా కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఇది ఇద్దరు భారత సహచరుల మధ్య స్నేహపూర్వక పరిహాసమని సూచించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. మ్యాచ్ విషయానికొస్తే, నిన్న మార్ష్ షోగా మిగిలిపోయింది. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో రెండు సిక్సర్లు, మూడు బౌండరీలతో 64 బంతుల్లో 117 పరుగులు చేసిన మార్ష్ లక్నోను 235/2కి చేర్చాడు. నికోలస్ పూరన్ 27 బంతుల్లో అజేయంగా 56 పరుగులు చేసి అండగా నిలిచాడు. సమాధానంగా, గుజరాత్ జట్టు ఛేదనలో చతికిలపడిరది. అవేష్ ఖాన్ 466 4 గుజరాత్‌ను భయపెట్టాడు. ఈ క్రమంలో విల్ ఓ'రూర్కే (3/27) సాయి సుదర్శన్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రాహుల్ తెవాటియా వికెట్లను పడగొట్టాడు. షారుఖ్ ఖాన్ 29 బంతుల్లో 57 పరుగులు చేయడం వృధాగా మారిపోయింది. ఈ క్రమంలో గుజరాత్ టార్గెట్ చేరుకోలేక 202/9కే పరిమితం అయింది.ఈ ఓటమితో, గుజరాత్ టాప్ 2లో స్థానం సంపాదించే అవకాశాన్ని కోల్పోయింది. కానీ చెన్నైపై విజయంతో ఇంకా ఆ స్థానాన్ని సంపాదించుకోవచ్చు. ఇప్పటికే ప్లేఆఫ్ పోటీ నుంచి నిష్క్రమించిన లక్నో, సీజన్ చివరి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడటంతో, సీజన్‌ను గొప్ప విజయంతో ముగించాలని చూస్తుంది. గుజరాత్‌తో పాటు, ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్, బెంగళూరు తమ ప్లేఆఫ్ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. దీంతో ప్లేఆఫ్ మ్యాచ్‌లు మరింత ఉత్కంఠగా మారనున్నాయి.

# నీరజ్ చోప్రాకు రెండో స్థానం



ఈ సీజన్‌లో తాను పాల్గొన్న రెండో ఈవెంట్‌లోనూ భారత స్టార్ జావెలిన్ త్రోయర్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన జానుస్ కుసోన్‌స్కీ స్మారక అథ్లెటిక్స్ మీట్‌లో నీరజ్ చోప్రా చివరిదైన ఆరో ప్రయత్నంలో తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. 27 ఏళ్ల నీరజ్ చివరి ప్రయత్నంలో జావెలిన్‌ను 84.14 మీటర్ల దూరం విసిరి మూడో స్థానం నుంచి రెండో స్థానానికి ఎగబాకాడు. ఈనెల 16న జరిగిన దోహా డైమండ్ లీగ్ మీట్‌లోనూ నీరజ్ రెండో స్థానాన్ని సాధించాడు.

దోహా డైమండ్ లీగ్ మీట్‌లో అగ్రస్థానంలో నిలిచిన జూలియన్ వెబెర్ (జర్మనీ) అదే జోరును ఇక్కడా కొనసాగించాడు. జూలియన్ వెబెర్ జావెలిన్‌ను 86.12 దూరం విసిరి తొలి స్థానాన్ని పొందగా... రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 83.24 మీటర్లు) మూడో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. తొలి ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్ రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 81.28 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత మూడు, నాలుగు ప్రయత్నాల్లో ఫౌల్ చేసిన నీరజ్ ఐదో ప్రయత్నంలో జావెలిన్‌ను 81.80 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత చివరి ప్రయత్నంలో తన ప్రదర్శనను మరింత మెరుగుపర్చుకొని రెండో స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు.

# విండీస్, ఐర్లాండ్ మ్యాచ్ రద్దు



ఐర్లాండ్ చేతిలో తొలి వన్డేలో ఎదురైన ఓటమి నుంచి తేరుకున్న వెస్టిండీస్ రెండో వన్డేలో అదరగొట్టింది. భారీ స్కోరు చేసి విజయంపై ఆశలు పెంచుకున్న వెస్టిండీస్‌ను వరుణదేవుడు కరుణించలేదు. ఫలితంగా ఈ రెండు జట్ల మధ్య జరిగిన రెండో వన్డే ఫలితం తేలకుండానే ముగిసింది. వెస్టిండీస్ ఇన్నింగ్స్ ముగిశాక భారీ వర్షం రావడంతో ఐర్లాండ్ ఛేజింగ్ సాధ్యపడలేదు. వెరసి మూడు వన్డేల సిరీస్‌లో ఐర్లాండ్ ప్రస్తుతం 1-0తో ఆధిక్యంలో ఉంది. టాస్ గెలిచిన ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 352 పరుగులు సాధించింది.

వన్‌డౌన్ బ్యాటర్ కేసీ కార్టీ (109 బంతుల్లో 102; 13 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో రెండో సెంచరీ నమోదు చేయగా... చివర్లో మాథ్యూ ఫోర్డీ (19 బంతుల్లో 58; 2 ఫోర్లు, 8 సిక్స్‌లు) శివమెత్తాడు. కేవలం 16 బంతుల్లోనే ఫోర్డీ అర్ధ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో వన్డేల్లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఏబీ డివిలియర్స్ (16 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును ఫోర్డీ సమం చేశాడు.

కెప్టెన్ షై హోప్ (57 బంతుల్లో 49; 5 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో అర్ధ సెంచరీని చేజార్చుకోగా... జస్టిన్ గ్రీవెస్ (36 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. ఐర్లాండ్ బౌలర్లలో బ్యారీ మెకార్తీ, జోష్ లిటిల్ రెండు వికెట్ల చొప్పున తీయగా... లియామ్ మెకార్తీకి మూడు వికెట్లు దక్కాయి. ఈ రెండు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే ఆదివారం జరుగుతుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in